సాక్షి
జగిత్యాల
ఆదివారం । 18 ఫిబ్రవరి । 2024



ఘనంగా నృసింహుడి కల్యాణం

ధర్మపురి: పట్టణంలో జీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పురోహితుల మంత్రోచ్ఛరణలతో అంగరంగ వైభవంగా జరిపారు.



నిధులు లేక..

సాగులో మెలకువలు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి క్లస్టర్‌కు ఒక రైతు వేదికను నిర్మించింది. -8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0/20.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండ వేడిమి పెరుగుతుంది. ఉదయం మంచు కురుస్తుంది. చలిగాలులు కొనసాగుతాయి.



పోదాం పద.. సమ్మక్క జాతర



అడవితల్లుల వేడుకకు అంతా సిద్ధమైంది. రెండేళ్లకోసారి వచ్చే సమ్మక్క– సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈనెల 21న సారలమ్మ ఆగమనంతో ప్రారంభమయ్యే జాతర 24న తల్లుల వన ప్రవేశంతో ముగియనుంది. జాతరకు మరికొద్ది రోజులు మాత్రమే సమయం ఉండగా.. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఉన్న సమ్మక్క గద్దెలను సిద్ధం చేస్తున్నారు. గద్దెలకు రంగులు, చలువ పందిళ్లు, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని గోదావరిఖని, నీరుకుల్ల, రేకుర్తి, శంకరపట్నం తదితర ప్రాంతాలు మినీ మేడారాన్ని తలపిస్తున్నాయి. మరో 100కు పైగా ప్రాంతాల్లో సమ్మక్క– సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించనున్నారు. దూరప్రాంతంలో ఉన్న మేడారం వెళ్లేందుకు వీలుకాని భక్తులు సమీప గద్దెల వద్ద తల్లులకు మొక్కులు చెల్లించుకుంటారు. జాతర సమీపిస్తున్న క్రమంలో ఉమ్మడి జిల్లాలోని సమ్మక్క జాతర ప్రాంగణాలు.. ఏర్పాట్లు.. ఆయా ప్రాంతాల ప్రత్యేకతపై సండే స్పెషల్..!! -8లో▸

న్యూస్‌రీల్

క్రీడలతోపాటు చదువులో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

జగిత్యాల: విద్యార్థులు క్రీడలతోపాటు చదువులో రాణించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్‌బాక్సింగ్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ క్రీడల్లో సైతం రాణిస్తూ ఉన్నతస్థానాలకు వెళ్లాలన్నారు. జిల్లాకు ఖ్యాతి తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం సారంగాపూర్ కేజీబీవీకి చెందిన విద్యార్థులు సాయి సృజన్, హర్షిత్, నిత్య, రిష్మిత, సుప్రియ, రజిత, బుగ్గారం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన హరీశ్, రాయికల్‌కు చెందిన కృష్ణను అభినందించారు. కార్యక్రమంలో కోచ్ రామాంజనేయులు, రమేశ్ పాల్గొన్నారు.

'రాళ్లవాగు' కాలువ మరమ్మతుకు నిధులివ్వండి

కథలాపూర్(వేములవాడ): మండలం భూషణరావుపేట, కథలాపూర్ పరిధిలోని రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు సీసీ లైనింగ్ కోసం నిధులు కేటాయించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ప్రాజెక్టు ద్వారా 3,500 ఎకరాలకు నీరందుతుందని, గతేడాది కురిసిన వర్షాలకు ప్రాజెక్టు కుడి కాలువకు గండి పడిందని, ఆ గండిని పూడ్చి, కాలువకు సీసీ లైనింగ్ చేస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నోడల్ అధికారి

జగిత్యాల: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, వసతులు కూడా బాగున్నాయని ఇంటర్ జిల్లా విద్యాధికారి నారాయణ అన్నారు. శనివారం అడ్మిషన్ల ప్రచారంలో భాగంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత ప్రవేశం కల్పించడంతోపాటు, ఉపకార వేతనాలు కూడా అందించనున్నట్లు వెల్లడించారు. గతేడాది ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులే జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అలియా మక్సూద్, అధ్యాపక బృందం సమీన, తిరుపతిరెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

'మహమ్మారి'పై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పెగడపల్లి: ఎయిడ్స్ నివారణపై జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పెగడపల్లిలో కళాకారులు కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జనజాగృతి వేదిక గడ్డం రమేశ్ కళాబృందం ఆటపాట, నాటికల ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. సామాజిక అంశాల్లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉంటూ.. వ్యాధి నివారణకు కృషి చేయాలని సూచించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

జగిత్యాల: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ ప్రత్యేక అధికారి ఆనంద్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని దళిత బంధు లబ్ధిదారుల వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. షెడ్యూల్డ్ కులాల వారి కోసం ప్రవేశపెట్టిన దళితబంధు, ఇతర పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రయోజనం పొందాలన్నారు. అనంతరం మొబైల్ టిఫిన్‌సెంటర్, చెప్పుల దుకాణం, లేడీస్ ఎంపోరియంను పరిశీలించారు. భవిష్యత్ వ్యాపార వృద్ధి తదితర అంశాలపై లబ్ధిదారులతో చర్చించారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ ఉన్నారు.

కూపన్ వ్యవస్థకు మంగళం

- ఎత్తివేసిన మున్సిపల్ అధికారులు
- డీజిల్ వినియోగంపై అనుమానాలు

జగిత్యాల: గతంలో జగిత్యాల మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య వాహనాల్లో వారానికోసారి డీజిల్ పోసేందుకు కమిషనర్ కూపన్ రాసిచ్చేవారు. వాహనదారులు సదరు కూపన్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఇస్తే ఆయన వాహనంలో డీజిల్ పోయించేది. కాగా ప్రస్తుతం ఆ పద్ధతిని ఎత్తివేయడంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డీజిల్ వినియోగంలో మున్సిపల్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో జగిత్యాలతో పాటు కోరుట్ల మున్సిపాలిటీలో కూపన్ల సిస్టమ్ ఉండేది.

డీజిల్ వినియోగంపై అనుమానాలు

శానిటేషన్ విభాగంలో ప్రత్యేకంగా వాహనాలకు డీజిల్ పోయించే విధానంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూపన్ పద్ధతిని ఎత్తివేయడంతో వాహనదారులు నేరుగా వెళ్లి డీజిల్ పోయించుకుంటున్నారు. అక్కడ జవాన్‌తో పాటు, సిబ్బంది సైతం ఉంటున్నారని అధికారులు పేర్కొంటున్నా.. ఇది సరైన పద్ధతి కాదని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ప్రతి వాహనంలో పోయించే డీజిల్ బిల్లులను సంబంధిత అధికారులకు అందజేస్తున్నా.. వాటిపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. కూపన్ సిస్టమ్ ఉన్నప్పుడు కమిషనర్ రాసి ఇచ్చిన తర్వాత శానిటరి ఇన్‌స్పెక్టర్ దానిని రికార్డు చేసేవారు. ఇప్పుడు బంక్ నిర్వాహకులు ఇచ్చే బిల్లులను మున్సిపల్‌లో రికార్డు చేస్తున్నారు. కాగా, ఇక్కడే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బంక్‌ల్లో పారిశుద్ధ్య వాహనాల్లో కాకుండా ఇతర వాహనాల్లో పోయించుకున్న బిల్లులు పెట్టే అవకాశాలుంటాయని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. గతంలో నెలకు డీజిల్ వినియోగంలో రూ.11 లక్షలకు పైగా ఖర్చు రాగా, అధికారులు దానిపై విచారణ చేపట్టడంతో రూ.8 లక్షల వరకు వచ్చింది. మళ్లీ ప్రస్తుతం నెలకు రూ.11 లక్షలకు పైగానే డీజిల్ బిల్లు వస్తోంది. ఇందులో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీల్లో కూపన్ సిస్టం ఉంది. ఇక్కడ కూపన్ సిస్టం ఎత్తివేయడంతో ఆడిట్‌లో ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. ఆడిట్ అధికారులు ఎక్కువగా కూపన్లనే పరిశీలిస్తుంటారు.

జీపీఎస్ సిస్టం ఉన్నా లేనట్లే..

జగిత్యాల మున్సిపల్‌లో పారిశుద్ధ్య వాహనాలు ఎక్కడెక్కడ తిరుగుతున్నాయనే సమాచారం తెలుసుకునేందుకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం తీసుకువచ్చారు. కానీ, కొన్ని వాహనాలకే జీపీఎస్ అమర్చారని, అవి కూడా సక్రమంగా పనిచేయడం లేదని, వాహనాల్లో డీజిల్ పోశాక అవి నిర్దేశిత ప్రదేశాలకు వెళ్లి చెత్త సేకరించడం లేదనే ఆరోపణలున్నాయి.



జగిత్యాల మున్సిపాలిటీ కార్యాలయం

అత్యధికంగా రిపేర్లకే..

జగిత్యాల మున్సిపాలిటీలో 48 వార్డులు ఉండగా, 64 పారిశుద్ధ్య వాహనాలున్నాయి. ఇందులో దాదాపు పెద్ద వాహనాలు అన్నీ రిపేరులోనే ఉండగా, కొన్ని వాహనాలు మాత్రమే నడుస్తున్నాయి. కానీ, డీజిల్ ఖర్చు మాత్రం రూ.11 లక్షలకు పైగా వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి జగిత్యాల బల్దియాలో కూపన్ సిస్టం తేవాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

అవకతవకలకు అవకాశం లేదు



డీజిల్ వినియోగాన్ని పారదర్శకంగా చేపడుతున్నాం. కూపన్ సిస్టమ్ లేకున్నప్పటికీ డీజిల్ పోయించే సమయంలో వాహనం వద్ద జవాన్ లేదా అధికారి ఒకరు తప్పకుండా ఉంటారు. వాహనానికి సంబంధించిన నంబరుతో కూడిన బిల్లు వస్తుంది. ఎలాంటి అవకతవకలకు చోటులేదు.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

నిధులు లేని 'మనఊరు - మన బడి'

- నత్తనడకన సాగుతున్న పనులు
- జిల్లాలో మొదటి విడత 274 పాఠశాలలు
- అంచనా వ్యయం రూ.117.93 కోట్లు
- విద్యా సంవత్సరం ముగింపునకు రెండు నెలలే
- బిల్లులు రాక నిలిచిపోయిన పనులు



ధర్మపురిలో అర్ధాంతరంగా ఆగిన డైనింగ్ హాలు

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి.. నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశంలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన ఊరు– మన బడి' పనులు నత్తనడక సాగుతున్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. చాలాచోట్ల పనులను నిలిపేశారు. చేసిన పనులకు అధికారులు ఎంబీ రికార్డులు చేయక.. కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ఈ పరిస్థితి తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఎంబీ రికార్డులు చేసినట్లెతే పనులు చకచకా సాగేవని అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తామని చెపుతున్న మాటలు నీటి మూటలయ్యాయనే ఆరోపణలున్నాయి. అటు బిల్లులు రాక.. ఇటు అభివృద్ధి చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

274 పాఠశాలల ఎంపిక

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలను ఆధునీకరించేందుకు అప్పటి ప్రభుత్వం సంకల్పించి మన ఊరు – మన బడి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకు లక్షలాది రూపాయలు మంజూరు చేసింది. ఆ నిధులతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. జిల్లాలో 783 ప్రభుత్వ పాఠశాలలుండగా వాటిలో మొదటి విడత కింద 274 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో పనులు పూర్తయినవి కేవలం 24 పాఠశాలల్లో మాత్రమే. ఇంకా 197 పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పాఠశాలల్లో పనుల ప్రగతి వివరాలు

- జిల్లాలో మొదటి విడత కింద 274 పాఠశాలలు ఎంపికయ్యాయి
- అంచనా వ్యయం రూ.117.93 కోట్లు
- పనులు పూర్తయినవి 24 పాఠశాలలు
- ప్రారంభానికి సిద్ధంగా ఉన్నవి 8
- సివిల్ పనులు పూర్తయినవి 45
- పనులు కొనసాగుతున్నవి 197
- ఫర్నిచర్ పంపిణీ అయినవి 24

బిల్లులు రాక నత్తనడక



గత ప్రభుత్వం మన ఊరు మన బడి కింద 274 పాఠశాలలను ఎంపిక చేసింది. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. పాఠశాలల అభివృద్ధిపై కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– జగన్‌మోహన్‌రెడ్డి, డీఈవో

- రంగులు పూర్తయినవి 92
- కాంట్రాక్టర్లకు చెల్లించిన నిధులు 20.20 కోట్లు

బిల్లులు రాక నిలిచిపోయిన డైనింగ్ హాలు

ధర్మపురిలోని బాలుర ఉన్నత పాఠశాలలో బిల్లులు రాక డైనింగ్ హాలు అర్ధాంతరంగా నిలిచిపోయింది. పాఠశాలలో 103మంది విద్యార్థులున్నారు. మన ఊరు మన బడి కింద పాఠశాలలో చేపట్టే అభివృద్ధి పనులకు రూ.42 లక్షలు మంజూరయ్యాయి. పనులు ఆర్‌అండ్‌అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. డైనింగ్ హాలు 50 శాతం పూర్తయ్యింది. దీంతోపాటు టాయిలెట్స్, కలర్స్, ఫ్లోరింగ్ తదితర పనులు చేపట్టాల్సి ఉంది.

అసంపూర్తిగా కిచెన్‌షెడ్

మండలంలోని తిమ్మాపూర్ పీఎస్‌లో 108 మంది విద్యార్థులున్నారు. మన ఊరు మన బడి కింద రూ.11 లక్షలు మంజూరయ్యాయి. పాఠశాలల్లో కిచెన్ షెడ్, ప్రహరీ, టాయిలెట్స్ రిపేర్లు, సంపు తదితర పనులు చేపట్టాల్సి ఉంది.

పూర్తి దశకు చేరిన నేరెళ్ల పాఠశాలలు

మండలంలోని నేరెళ్ల పీఎస్, జెడ్పీహెచ్‌ఎస్‌లు మన ఊరు మన బడి కింద ఎంపికయ్యాయి. పాఠశాలలకు రూ.59లక్షలు మంజూరయ్యాయి. బిల్లులు చెల్లించడంతో పనులు పూర్తి దశకు చేరాయి. పాఠశాలల్లో అన్ని వసతులతో అందంగా తీర్చిదిద్దారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్/జగిత్యాల/సారంగాపూర్: సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలుకు అంబేడ్కర్ రచించి రాజ్యాంగమే స్ఫూర్తి అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాలరూరల్ మండలం కండ్లపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ ఆలోచన విధానం అమలుకు కృషి చేయాలన్నారు. గ్రామానికి చెందిన ఎస్‌ఆర్‌ఐలు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతకుముందు జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అదనపు గదుల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. మాజీ సర్పంచ్ చంద రజిత, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఎమ్మెల్సీ అన్నారు. సారంగాపూర్ సింగిల్‌విండో అధ్యక్షుడు ఏలేటి నర్సింహ్మారెడ్డి, లక్ష్మీదేవిపల్లి ఎంపీటీసీ ఏలేటి మమత, విండో డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి ఉన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని వివిధ ఆలయాల అభివృద్ధికి రూ.85లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్సీ తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

'డిప్యూటీ కలెక్టర్స్' డైరీ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జగిత్యాల: డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

జగిత్యాల: మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి ఏప్రిల్ 7నుంచి పరీక్షలు ప్రారంభమవుతా యని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి మోడల్ స్కూళ్లలో 6వ తరగతికి 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 22వరకు గడువు ఉందని తెలిపారు. అడ్మిషన్ ఫీజు ఓసీలకు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూసీ వారికి రూ.125గా ఉంటుందన్నారు. వివరాల కోసం te a nfa na nam-r.c-f-f.gov.i n సంప్రదించాలని సూచించారు.

నాలుగేళ్లలో 3 కొలువులు

- తాజాగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఫలితాల్లో మొదటి ర్యాంకు



మౌనిక

కోరుట్ల: నాలుగేళ్లలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది కోరుట్లకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు బెజ్జారపు వేణు–మాధవిల కూతురు మౌనిక. ఆమె 2013లో ఎం.ఫార్మసీలో గోల్డ్‌మెడల్ సాధించింది. మౌనిక వివాహం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శేఖర్‌తో జరిగింది. అనంతరం మళ్లీ చదువుపై దృష్టిపెట్టి, 2019లో వీఆర్‌వో ఉద్యోగం సాధించింది. ఆ జాబ్ చేస్తూనే అదే ఏడాది ఫార్మసిస్ట్ పోస్టుకు ఎంపికైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఫార్మసిస్ట్‌గా పని చేస్తోంది. 2022 డిసెంబర్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వగా దరఖాస్తు చేసుకుంది. 6 నెలల కష్టపడి చదివి, పరీక్ష రాయగా శుక్రవారం రాత్రి ఫలితాలు వెలువడ్డాయి. ఆమె రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. తన భర్త శేఖర్ ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ ఉద్యోగాలు సాధించానని తెలిపింది.

వనదేవతల జాతరకు ఏర్పాట్లు



సమ్మక్క సారలమ్మ గద్దెలపై అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

జగిత్యాల: జిల్లాలోని పొలాసలో వెలిసిన సమ్మక్క, సారలక్క జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం పొలిమేర బంధన, లక్ష్మీదేవత, పంచపాండవుల పూజ, సారలమ్మ కుండలు గద్దె నిండుకొనుట, 22న గురువారం ఉదయం 9 గంటలకు హోమం, సుంకు ప్రారంభం, మిరిమిడి, సాయంత్రం 5 గంటలకు వనం గద్దెలు నిండుట, రాత్రి 9 గంటలకు సమ్మక్కదేవి గద్దెకు చేరుకుంటారు. శుక్రవారం మొక్కులు తీర్చుకుని శనివారం బలిహరణం నిర్వహిస్తారు. పొలాసలో రెండేళ్లకోసారి జరిగే వనదేవతలు సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. ఇక్కడ జరిగే సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ కోసం కమిటీలు వేసి నిర్వహిస్తుంటారు. జాతరకు వచ్చే భక్తుల కోసం గద్దె ప్రదేశాలు ముస్తాబు చేసారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలను జాతర ప్రదేశాల్లో ఏర్పాట్లు చేసినట్లు ఫౌండర్ రవీందర్ తెలిపారు.

జేఎన్టీయూలో ముగిసిన ఫైనైట్ వర్క్‌షాపు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫైనైట్ ఎలిమెంట్ అనాలసిస్ యూజింగ్ అన్సిస్ వర్క్‌బెంచ్ శనివారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ దశలోనే నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని, ఇది వారి భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఇలాంటి వర్క్‌షాపులు మరిన్ని నిర్వహించాలని సూచించారు. ఫ్యాకల్టీని అభినందించారు. వర్క్‌షాపు మెకానికల్ విభాగం అధిపతి కన్వీనర్ కందూకూరి వసంత్‌కుమార్ మాట్లాడుతూ.. వర్క్‌షాపులో భాగంగా అనాలసిస్ ఎలా చేయాలో నేర్పించామన్నారు. వర్క్‌షాపునకు సహకరించిన రిసోర్స్ పర్సన్ రాజమహేంద్ర సిమూలేషన్ ఇంజినీర్‌కు అభినందనలు తెలిపారు.



జేఎన్టీయూ వద్ద విద్యార్థులు

పోదాం పద.. సమ్మక్క జాతర

- ఈ నెల 21 నుంచి సమ్మక్క–సారలమ్మ జాతర
- ముస్తాబవుతున్న అమ్మవార్ల గద్దెలు
- భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- ఉమ్మడి జిల్లాలో ఎత్తు బెల్లం మొక్కులతో మొదలైన సందడి

గిరిజన తల్లులు సమ్మక్క–సారలమ్మ జాతర సమీపిస్తోంది.. ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనుంది. ఇప్పటికే పల్లె, పట్టణం అనే తేడా లేకుండా భక్తులు ఎత్తు బెల్లం మొక్కు చెల్లించేందుకు సమ్మక్క మేడారం వెళ్తుండటంతో ఉమ్మడి జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. జాతర నిర్వహించే ప్రాంతాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బస్సులు, విద్యుత్, తాగునీరు, స్నానఘట్టాలు, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, టాయిలెట్లు, పార్కింగ్, విడిది, చలువ పందిళ్లు తదితర ఏర్పాట్లపై జాతర కమిటీల నిర్వాహకులు అధికారులు సమన్వయంతో ముందుకుసాగుతున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు విధులకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతర జరిగే తీరు, చేస్తున్న ఏర్పాట్లపై ప్రత్యేక కథనం.

హన్మంతునిపేటలో 42 ఏళ్లుగా..


హన్మంతునిపేట సమ్మక్క–సారలమ్మ ఆలయం

పెద్దపల్లిరూరల్: గిరిజన తల్లులు సమ్మక్క–సారలమ్మ జాతరకు అమ్మవార్ల ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, పెద్దకల్వల గ్రామాల్లో ఏటా జరుపుతున్నారు. హన్మంతునిపేట శివారులో 42 ఏళ్లుగా, తుర్కలమద్దికుంట పెద్దగుట్ట వద్ద 16 ఏళ్లుగా నిర్వహిస్తున్న జాతరకు భక్తులు పోటెత్తుతారు. హన్మంతునిపేటకు చెందిన కంకటి గోపాల్ కిషన్‌రావు, ఆయన సోదరులు ప్రభాకర్‌రావు, శంకర్‌రావు, సుగుణాకర్‌రావు, రాంచందర్‌రావు, ప్రసాదరావులు తమ తండ్రి మధుసూదన్‌రావు, తల్లి అంబాబాయి జ్ఞాపకార్థం 10 గుంటల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ స్థలంలో గ్రామ పెద్దలు సమ్మక్క–సారలమ్మ ఆలయం నిర్మించారు. ఈసారి జాతరకు అన్ని వసతులు కల్పిస్తున్నారు.

ఏర్పాట్లు చేశాం..



సమ్మక్క జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలు బిగించాం. అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– పొల్సాని సుధాకర్‌రావు, హన్మంతునిపేట ఆలయ కమిటీ చైర్మన్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐదుచోట్ల


శాంతినగర్ సమ్మక్క–సారలమ్మ గుడి

సిరిసిల్ల: సమ్మక్క జాతర నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని ఒబులాపూర్ మూడు రోజులపాటు జనసంద్రమవుతుంది. సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని ముంబయి, భీవండి, షోలాపూర్, హైదరాబాద్ వంటి పట్టణాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు. 40 ఏళ్లుగా ఇక్కడ జాతర జరుగుతోంది. సిరిసిల్ల నుంచి మండెపల్లి, రాళ్లపేట మీదుగా 13 కిలోమీటర్లు ప్రయాణిస్తే సమ్మక్క–సారలమ్మ గద్దెలు దర్శనమిస్తాయి. ఆటోల సౌకర్యం ఉంది. వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి శివారు శాంతినగర్ భానోత్ గిరిజన తండాలో 52 ఏళ్లుగా సమ్మక్క–సారలమ్మ జాతర సాగుతోంది. సమీప గ్రామాల నుంచే కాకుండా పొరుగున ఉన్న నిజామాబాద్ జిల్లా నుంచి గిరిజనులు ఎక్కువగా వచ్చి, అమ్మవార్లను దర్శించుకుంటారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో ఎనిమిదేళ్లుగా జాతర జరుగుతోంది. కోనరావుపేట మండలంలోని శివంగళపల్లె, ముస్తాబాద్ మండల కేంద్రంలో గిరిజన తల్లుల గద్దెలు సిద్ధమయ్యాయి.

కొలనూర్‌లో కోయ పూజారులచే..


ముస్తాబైన సమ్మక్కసారలమ్మ గద్దెలు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని కొలనూర్‌లో 1974 నుంచి జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతరకు ఈసారి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మేడారం కోయ పూజారులచే పూజలు నిర్వహించనున్నారు. ఇక్కడ అల్లీమాసాని చెరువు(జంపన్నవాగు) ఉంది. సికింద్రాబాద్, కాజీపేట్, భద్రాచలం, సిర్‌పూర్‌కాగజ్‌నగర్, నాగపూర్ నుంచి కొలనూర్ జాతర వరకు రైళ్ల సౌకర్యం ఉంది. దీనికితోడు భక్తులకు గోదావరిఖని, కరీంనగర్, వరంగల్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉన్నాయి.


మీర్జంపేట జాతర స్వాగతతోరణం

మీర్జంపేట మానేరు తీరాన..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మీర్జంపేటలో మానేరు నదీతీరాన సమ్మక్క జాతర 52 ఏళ్లుగా సాగుతోంది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఎత్తు బెల్లం, తలనీలాలు సమర్పించి, మొక్కు చెల్లించుకుంటారు. పెద్దరాతుపల్లి మానేరు తీరంలో, పెగడపల్లి హుస్సేన్‌మియా వాగు తీరంలోనూ జాతర జరుగుతుంది.

భక్తులకు సౌకర్యాలు కల్పించాం



మీర్జంపేట జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు సకల సౌకర్యాలు కలిపించాం. మానేరు వెంట మోటార్లు 24 గంటలు నడిపించేందుకు రైతులు సహకరిస్తారు. ట్రాన్స్‌కో అధికారులు జాతర సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటారు. గ్రామ యువకులు, మహిళలు వలంటీర్లుగా సేవలందిస్తారు.

– అశోక్, జాతర కమిటీ చైర్మన్, మీర్జంపేట

‘ఖని’లో మినీ మేడారం


గోదావరి తీరంలో జాతర ప్రాంగణం

గోదావరిఖని(రామగుండం): మినీ మేడారంగా విలసిల్లుతున్న గోదావరిఖని గోదావరి నదీతీరం అడవి తల్లుల జాతరకు ముస్తాబవుతోంది. సింగరేణి యాజమాన్యం 1992లో గోదావరి తీరంలోని సంస్థ స్థలంలో సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభించింది. ఏటా సమ్మక్క మేడారం ప్రాంతానికి చెందిన కోయ పూజారులను తీసుకువచ్చి, ఇక్కడ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి 5 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. జాతర సమయంలోనే కాకుండా గోదావరి తీరాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక దృష్టిసారించారు. ప్రధానంగా సింగరేణి యాజమాన్యం ద్వారా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గోదావరి నదిలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించామని తెలిపారు.

పకడ్బందీ ఏర్పాట్లు



భక్తులకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయి. మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం. నదీ తీరంలో స్నానాలు చేసేందుకు షవర్స్ ఏర్పాటు చేశాం. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలిక గదులు సిద్ధం చేస్తున్నాం. వంద టాయిలెట్స్ నిర్మిస్తున్నాం.

పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి

చిల్వాకోడూర్ ఎక్కల్‌దేవి గుట్ట కింద..


చిల్వాకోడూర్‌లో ముస్తాబైన అమ్మవార్ల గద్దెలు

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని చిల్వాకోడూర్, వెల్గటూర్ మండల కేంద్రంతోపాటు, రాజారాంపల్లి, ధర్మపురి మండలంలోని రామయ్యపల్లి గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మ జాతర జరుగుతుంది. నిర్వాహకులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిల్వాకోడూర్ ఎక్కల్‌దేవి గుట్ట కింద నిర్వహించే జాతరకు జగిత్యాల జిల్లాలోనే అత్యధిక మంది భక్తులు తరలివస్తారు. అమ్మవార్లకు బుక్క, పూసవేర్ల, మేడారం పూజారులు పూజలు చేస్తారు. 1994లో గ్రామానికి చెందిన గందె రామయ్య, కరెంట్ రాజయ్య కలలో దేవతలు కనిపించడంతో కంకవనం తీసుకువచ్చి, ఎక్కల్‌దేవి గుట్ట సమీపంలో పాతి, పూజలు చేశారు. ఆ తర్వాత జాతర ప్రారంభమైంది. 2001 నుంచి మేడారం పూజారులచే పూజలు చేయిస్తున్నారు. రాజారాంపెల్లిలో ఏలేటి వంశీయులు 2011లో ఏర్పాటు చేసిన గద్దెల వద్ద ఏటా జాత జరుగుతోంది. ఈసారి కూడా ఏర్పాట్లు చేసినట్లు జాతర కమిటీ చైర్మన్ శైలేందర్ రెడ్డి తెలిపారు.

ఏటా జాతరకు వస్తా..

మాది సమక్క–సారలమ్మ వెలసిన మేడారం గ్రామం. చిల్వాకోడూర్‌లో మా బావ కోరం హన్మంతు ఏటా జాతరకు వచ్చి, పూజలు చేసేవాడు. ఆయన నాలుగేళ్ల క్రితం చనిపోవడంతో నేను వస్తున్నాను. ఏటా లక్షన్నరకు పైనే భక్తులు వస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, జాతరకు సహకరించాలి.

– కోరం లక్ష్మణ్, పూజారి, సమ్మక్క మేడారం

20 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లి శివారులో శనివారం 20 (ఏడు క్వింటాళ్ల)బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. బీర్‌పూర్ ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం.. ధర్మపురి మండలం దొంతాపూర్‌కు చెందిన గుండ చంద్రశేఖర్ వివిధ గ్రామాల్లోని వినియోగదారుల నుంచి రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా.. పోలీసులు కోమన్‌పల్లి శివారుల్లో పట్టుకున్నారు. ఆటోను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చిన్నకెనాల్ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. ధర్మపురి నుంచి జగిత్యాల హౌసింగ్‌బోర్డుకు శనివారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

13.24 కిలోల గంజాయి పట్టివేత

- 40 గ్రాముల చరాస్ కూడా..
- ఇద్దరు నిందితుల అరెస్టు
- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్ చౌరస్తా వద్ద పోలీసుల తనిఖీల్లో 13.24 కిలోల గంజాయి పట్టుబడింది. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయి, చరాస్ (గంజాయి మొక్క నుంచి తీసే బంక)ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. జగిత్యాలరూరల్ మండలం బాలపల్లికి చెందిన మారంపెల్లి లక్ష్మణ్, గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌కు దొమ్మాటి కార్తీక్ స్నేహితులు. తాగుడుతోపాటు జల్సాలకు అలవాటుపడ్డారు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి రవాణను ఎంచుకున్నారు. వారి స్నేహితుడైన పెగడపల్లికి చెందిన అజయ్ ద్వారా ఒడిశా రాష్ట్రానికి చెందిన నూకరాజు గురించి తెలుసుకున్నారు. ఈ నెల 14న ద్విచక్రవాహనంపై ఒడిశా వెళ్లారు. అతడికి రూ.15వేలు ఇచ్చి 13.24 కిలోల గంజాయి, 40 గ్రాముల చరాస్, మొబైల్ ఫోన్‌తో బయల్దేరారు. ఈనెల 16న భద్రాచలం, కరీంనగర్ మీదుగా గొల్లపల్లి మండలం అబ్బాపూర్ వస్తున్నారు. అప్పటికే ధర్మపురి సీఐ రాంనరసిహారెడ్డి, గొల్లపల్లి ఎస్సై సతీశ్ తమ సిబ్బందితో చిల్వకోడూర్ వద్ద శుక్రవారం తనిఖీలు చేస్తున్నారు. వారిద్దరూ అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకుని ఆరా తీయగా అసలు విషయం వెలుగుచూసింది. వారి నుంచి గంజాయి, చరాస్, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, చరాస్ విలువ రూ.2,65,640 ఉంటుందని డీఎస్పీ తెలిపారు. పెగడపల్లికి చెందిన అజయ్, ఒడిశాకు చెందిన నూకరాజు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న డీఎస్పీ డి.రఘు చందర్, వెంటేశ్వర్లు, నరసింహా రెడ్డి, సతీశ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చరాస్ అంటే..?

సాధారణంగా గంజాయి మొక్క ఆకులను ఎండబెట్టి తంబాకు తీరుగా చుట్టల్లో, సిగరెట్లలో పెట్టుకుని పీల్చడం ద్వారా మత్తులోకి జారుతారు. అయితే చరాస్‌ను గంజాయి ఆకుల నుంచి కాకుండా కాండం, కొమ్మలు, ఆకులు విరిచిన సందర్భంలో వచ్చే బంకవంటి పదార్థంతో తయారు చేస్తారు. మత్తు పదార్థాల్లోనే నాణ్యమైనదిగా చరాస్‌కు పేరు. జిల్లాలో ఇదివరకు గంజాయి మాత్రమే పట్టుబడగా.. ప్రస్తుతం చరాస్ దొరకడం ఆందోళన కలిగిస్తోంది. చరాస్ నియంత్రణపై పోలీసు యంత్రాంగం మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థిని


అభినందిస్తున్న ప్రిన్సిపల్

జగిత్యాలరూరల్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఇంగ్లిష్ లాంగ్వేజ్ అసోసియేషన్ జిల్లాస్థాయి స్పెల్ విజార్డ్ పోటీల్లో కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థి రాచర్ల అశ్రితవర్మ మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ నాగసుధారాణి తెలిపారు. ఈనెల 26న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అశ్రితవర్మ పాల్గొంటుందని తెలిపారు. అశ్రిత వర్మను శనివారం ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, ముజీబ్ ఉన్నీన అభినందించారు.

గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు


వివరిస్తున్న విద్యార్థులు

కథలాపూర్: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం మండలం సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ‘గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం’లో భాగంగా పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు రైతులకు ఆధునిక సాగు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు శేఖర్, ఎం.డీ ఫమీనా, వినిత, రైతులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


అమ్మవ్వ(ఫైల్)

గొల్లపల్లి: మండలంలోని అబ్బాపూర్‌కు చెందిన మాదాసు అమ్మవ్వ (110) శనివారం మృతిచెందారు. అమ్మవ్వకు పెళ్లయిన కొద్దిరోజులకే భర్త మృతిచెందాడు. అప్పటినుంచి మేనల్లుళ్లయిన మాదాసు తిరుపతి, రమేశ్, భాస్కర్ పోషిస్తున్నారు. వయసు పైబడడంతో అమ్మవ్వ శనివారం మృతిచెందారు. ఆమెకు గ్రామంలో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లికి చెందిన చిర్ర వంశీ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయన తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

బండలింగాపూర్‌లో అగ్నిప్రమాదం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో శనివారం అగ్నిప్రమాదం జరిగి రేకుల షెడ్డు దగ్ధమయింది. గ్రామానికి చెందిన ఎర్రం శంకర్–సుభద్ర దంపతులు చిన్నకుమారుడు రాము ఇంటివద్ద రేకులషెడ్డులో ఉంటున్నారు. షెడ్డుకు తాళంవేసి ఉపాధి పనులకు వెళ్లారు. కొద్దిసేపటికి పొగ రావడాన్ని గమనించిన స్థానికులు మెట్‌పల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో మంటలు పెద్ద ఎత్తున చేలరేగాయి. మంటలను ఆర్పేందుకు యత్నించిన గ్రామానికి చెందిన షాహిద్ తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే దేవమ్మకు స్వల్పగాయమైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. షాహిద్‌ను మొదట నిజామాబాద్ ఆసుపత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాద ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదస్థలాన్ని ఇబ్రహీంపట్నం పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ తండాకు చెందిన లకావత్ నరేశ్‌కు తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. నరేశ్ స్వగ్రామం నుంచి కథలాపూర్‌కు బైక్‌పై వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి మరో బైక్‌పై వచ్చిన వ్యక్తులు ఢీకొట్టి పరారయ్యారు. ఈ ప్రమాదంలో నరేశ్ కాలు, చేతికి, తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్య

మల్లాపూర్: అనారోగ్యంతో బాధపడుతూ.. జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాఘవపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అలకుంట నడిపి రాజం, లక్ష్మీ దంపతుల కూతురు పూజ(18) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చికిత్స పొందినా నయంకాలేదు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబసభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందింది. లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడి



ధర్మపురి: నాటుసారా, గుడుంబా స్థావరాలపై సీసీఎస్ పోలీసులు శనివారం మెరుపు దాడులు చేశారు. 13 లీటర్ల నాటుసారా, ముడి సరుకును స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని తుమ్మెనాల గ్రామ శివారులో రహస్యంగా గుడుంబా, నాటుసార తయారు చేస్తున్నారని సమాచారం మేరకు సిబ్బందితో ఆకస్మికంగా దాడులు చేశామని, విచారణ కోసం ధర్మపురి పోలీసులకు అప్పగించామని పేర్కొన్నారు.

నిధులు లేక.. నిర్వహణ కానరాక..


గొల్లపల్లి మండలం చందోళి రైతు వేదిక


అపరిశుభ్రంగా మరుగుదొడ్డి

- భారంగా రైతు వేదికలు
- 18 నెలలుగా నిలిచిన నిధులు

నిధుల కేటాయింపు	(నెలకు రూ.లలో)
పరిశుభ్రతకు	3,000
శిక్షణకు	2500
స్టేషనరీకి	1000
విద్యుత్‌బిల్లు	1000
మరమ్మతు	1000
తాగునీరు	500
మొత్తం	9000

గొల్లపల్లి: సాగులో కొత్త రకం విత్తనాల పరిచయం, పంటల సాగులో మెలకువలు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి క్లస్టర్‌కు ఒక రైతు వేదికను నిర్మించింది. వారంలో రెండుసార్లు (శుక్ర, మంగళవారం) ఏఈవోలు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించింది. ప్రారంభంలో ప్రతినెలా నిర్వహణ చార్జీల కింద రూ.9వేల చొప్పున అందించింది. వాటితో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి కొన్నాళ్లు అవగాహన కల్పించారు. పంటల సాగులో మెలకువలు వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను సైతం అక్కడే నిర్వహించారు. అయితే 18 నెలలుగా నిర్వహణకు సంబంధించిన నిధులు నిలిచిపోవడంతో వేదికలు భారంగా మారుతున్నాయి.

71 వేదికలు

జిల్లావ్యాప్తంగా 71 రైతు వేదికలు నిర్మించారు. అవి పూర్తయినప్పటి నుంచి అన్ని సమావేశాలను ఇందులోనే నిర్వహిస్తున్నారు. వేదిక పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ బిల్లులు సమావేశాల నిర్వాహణ కోసం నెలకు రూ.9వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది. 2022 ఆగస్టు వరకు నిధులు విడుదల చేశారు. అనంతరం మర్చిపోవడంతో నిర్వహణ భారంగా మారింది. గతంలో వేదికను శుభ్రం చేసేందుకు నియమించుకున్న సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో పనులకు రావడం లేదని ఏఈఓలు చెబుతున్నారు.

అన్నదాతలకు మేలు..

రైతు వేదికలు అన్నదాతలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సామగ్రి పంపిణీ చేయడం దగ్గరి నుంచి సాగులో సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ప్రతి వ్యవసాయ క్లస్టర్ పరిధిలో శాస్త్రవేత్తలు రైతులకు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అలాంటి రైతువేదికల నిర్వహణకు ఏడాదిన్నరగా నిధులు విడుదల కావడం లేదు. ముఖ్యంగా సమావేశాలు జరిగే సమయంలో మరుగుదొడ్లలో నీటి సౌకర్యం లేక దుర్గంధం వెదజల్లుతోందని రైతులు వాపోతున్నారు.

సొంతంగా ఖర్చు పెడుతున్నం

రైతు వేదిక నిర్వహణకు ఏడాదిన్నరగా నిధులు విడుదల కాకపోవడంతో ఆ భారాన్ని మేమే మోయాల్సి వస్తోంది. గతంలో వేదికను శుభ్రం చేసేందుకు నియమించుకున్న సిబ్బందికి వేతనాలు రాక పనులకు రావడం లేదు. కొత్త ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

– కరుణ, ఏఈ, గొల్లపల్లి

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

రైతు వేదికల నిర్వహణకు నిధులు నిలిచిపోయిన విషయం నిజమే. ఏఈఓలు స్థానికంగా ఉన్న పంచాయతీ సిబ్బందితోనే శుభ్రం చేయిస్తున్నారు. రైతుల శిక్షణ, ఇతర కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటన్నాం. నిధులు విడుదల కాగానే అందజేస్తాం.

– సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి